కాఫీ రైతులకు రుణాలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని కించాయి పుట్టు, జర్రెల, కరిముఖి పుట్టు, ఏనుగు రాయి, డోడిపుట్టు, పెద్దగూడ, కిలగడ గ్రామ పంచాయతీలలోని పలు గ్రామాలకు చెందిన 50 మంది ఆదివాసి గిరిజన కాఫీ రైతులకు 3 లక్షల 25 వేల జిసిసి ద్వారా రుణాలు మంజూరు చేశామని మండల జిసిసి మేనేజర్ పాంగి కుమారస్వామి శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక జిసిసి గోదాములో శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. నిలువ ఉన్న సరుకులను పరిశీలించారు. రేషన్ సరుకులు సకాలంలో డిపోలకు సరపరా చేయడం, రేషన్ కార్డు దారులకు అందించడం సక్రమంగా జరుగుతుందని తెలిపారు. రుణాలు పొందిన రైతులు కాఫీ పంటను జిసిసికి మాత్రమే అమ్ముకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిసిసి గోదాము సూపరింటెండెంట్ ముత్యాల రామ్మూర్తి పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న జిసిసి మేనేజర్

నేడు అరణ్య గర్జన సభ

- ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- మజ్జివలసకు భారీగా తరలిరానున్న గిరిజనం
- హైడ్రో పవర్ ప్రాజెక్టుపై ఉధృతంగా సాగుతున్న ఉద్యమం
- ఆరు రోజులు.. 400 కిలోమీటర్లు.. చైతన్యం నింపిన జీపుజాతా

జంబువలసలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

అనంతగిరి మండలం డొంకపుట్టులో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం :ఆదివాసీలను జల సమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలంటూ పాడేరు ఏజెన్సీలో ఉద్యమం ఉధృత రూపం దాలుస్తోంది. సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 22న సీలేరులో ప్రారంభమైన జీపుజాతా ఆరు రోజులపాటు గిరి గ్రామాల గుండా 400 పైచిలుకు కిలోమీటర్లు సాగి, హైడ్రో ప్రాజెక్టుల వల్ల ఆదివాసీ ప్రాంతానికి కలిగే నష్టాన్ని అందరికీ తెలియజెప్పింది. గిరిజనుల్లో చైతన్యం నింపింది. అదానీ, నవయుగ వంటి కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల భూములను, అడవిని ఎలా దోచిపెడుతున్నదీ ఈ జాతా విడమర్చిచెప్పింది. గిరిజనుల ఇతర సమస్యలనూ ఈ జాతా వెలుగులోకి తెచ్చింది. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స నేతృత్వంలో ఈ జాతా సాగింది. దీని ముగింపులో భాగంగా హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలసలో 'అరణ్య గర్జన సభ' శనివారం ఉదయం 10 గంటల నుంచి జరుగనుంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ పిలుపునిచ్చాయి.

హైడ్రోతో గిరిజనుల బతుకులు ఛిద్రం
సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

అనంతగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదాని, నవయుగ సంస్థతో కుమ్మక్కై హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసి ఆదివాసీలను జల సమాధి చేసేందుకు చూస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స విమర్శించారు. మండలంలోని పెద్దబిడ్డ, లుంగపర్తి, వాలసి, వేంగడ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో అరణ్య గర్జన జీపు జాతా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఏజెన్సీ అనంతగిరి, అరకు, హుకుంపేట మండలాల్లో అదానీ, నవయుగ కంపెనీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాలకు జీవో 51, 13 అనుమతులు జారీ చేశాయని దుయ్యబట్టారు. అనంతగిరి మండలంలోని టోకూరు చిట్టంపాడు, గుమ్మకోట పంచాయతీ గుజ్జలి, పెదకోట, అరకు మండలం లోతేరు పంచాయతీ దూదుకోండి, హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామాలలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతులను జారీ చేశారన్నారు. దీనిపై ఆదివాసీలు ఏకమై తిరుగు బాటుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని తమ పార్టీ అరణ్య గర్జన పేరుతో ఏజెన్సీ మండలాల్లో పర్యటించి ఆదివాసీ హక్కులు, చట్టాలపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలపారు. అనంతగిరి మండలం నిమ్మలపాడు గ్రానైట్, డుంబ్రిగూడ మండలంలో కాల్ సైట్‌పై జరిగిన పోరాటం తరహాలోనే ఈ హైడ్రో పవర్ ప్రాజెక్టు ఉద్యమం మరింత ఉధృతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఇప్పటికే దీనిపై గత ఏడు నెలల నుండి ఆదివాసి గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపడు తున్నామన్నారు. దీనిపై అరకు, పాడేరు. ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. గిరిజనుల పక్షాన పోరాడటానికి టిడిపి, వైసిపి నేతలు ముందుకు రాలేదని ఇటువంటి నాయకులను భవిష్యత్తులో బుద్ది చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు పొద్దు బాలదేవ్, పడాల్, ఎస్.కొండలరావు, బుద్రయ్య పాల్గొన్నారు

అనంతగిరి:బీటీ రోడ్డు పనులు పూర్తి చేయకుండా తూతు మంత్రంగా పనులు చేపట్టి నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సంబంధిత కాంట్రాక్టర్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక గిరిజనులతో సిపిఎం నేతలు ధర్నా చేపట్టారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ జీపుజాత గురువారం రాత్రి చెరకుమడతలో చేరుకుంది. అనంతరం జీపుజాత సిపిఎం బృందం శుక్రవారం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లడతూ, పెద్దబిడ్డ పంచాయితీ బొడ్డగెడ్డ మెయిన్ రోడ్డు నుండి చెరకు మడత, కంటిపురం వరకు సుమారు రెండు కిలోమీటర్లు సుమారు రూ కోటి రూపాయలు గత ఐదేళ్ల క్రితం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు.కాంట్రాక్టర్ కంకర మెటల్ వేసి వదిలి వేశారని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.పనులు పూర్తి కాకుండానే పూర్తి చేసినట్లు నిధుల స్వాహాకు పాల్పడ్డారని, వారిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హుకుంపేట: మజ్జివలసలో జరిగే అరణ్య గర్జన సభను విజయవంతం చేయాలని పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. సీలేరు నుంచి ప్రారంభమైన అరణ్య గర్జన జీపు జాతా శుక్రవారం మజ్జి వలసకు చేరుకుంది. జంబువలసలోని ఉపాధి కార్మికులతో ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం బలమైన పోరాటం చేయాలన్నారు. మజ్జివలస సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఉద్యమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘాలు, ఉపాధి కార్మికులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు అందరూ ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ యాత్ర బృందంలో నాయకులు కొర్ర త్రినాధ్, ఈశ్వరావు, మాజీ సర్పంచ్ కొండలరావు, వరహాలు, సింహాద్రి తదితరులు ఉన్నారు.

మరోసారి వరద భయం..

గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి ప్రవహిస్తోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యూసి అధికారులు హెచ్చరిస్తున్నారు. వందల ఎకరాల్లో మిర్చి, వరి పంటలు నీట మునిగాయి. పోలవరంతో అటు ఇళ్లు, ఇటు పంటలు పోయి రోడ్డున పడ్డామని ముంపువాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పెరుగుతున్న శబరి, గోదావరి నీటిమట్టాలు
- మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి ప్రవాహం
- మరింత పెరగొచ్చంటున్న సిడబ్ల్యూసి అధికారులు
- ముంపు వాసుల ఆందోళన
- నీట మునిగిన మిర్చి, వరి పంటలు
- చింతూరు విఆర్‌పురం మండలాలకు రాకపోకలు బంద్
- భద్రాచలం కూనవరం రహదారిపై నిలిచిన నీరు

కూనవరం: నీట మునిగిన మిరప పైరు

ఎటపాక: నందిగామలో నీట మునిగిన మిరప పైరుతో రైతు

ప్రజాశక్తి-ఎటపాక :
గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చింది. శుక్రవారం మధ్యాహ్నానికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తోంది. మధ్యాహ్నం 12 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి వరద 43 అడుగులకు చేరుకుంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 8 గంటలకు 45.10కు చేరుకుంది. రెండో ప్రమాద హెచ్చరికకు చేరుకుంటుందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు తెలిపారు. భద్రాచలం- కూనవరం ప్రధాన రహదారిపై మురుమూరు వద్ద వరద నీరు చేరుకుంది. నెల్లిపాక వీరయిగూడెం, కన్నయ్యగూడెం-గట్టుగూడెం మధ్య రహదారులపైకి వరద నీరు చేరుకోవడంతో ఆయాగ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మురుమూరు, నందిగామ, గౌరిదేవిపేట, గన్నవరం, తోటపల్లి, నెల్లిపాక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో మిరప చేలు నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చింతూరు : భారీవర్షాలకు ఎగువ ప్రాంతంలో వరదనీరు గోదావరి, శబరి నదుల్లో వచ్చి చేరుతోంది. చింతూరులో శబరినది నీటిమట్టం 36.36.మీటర్లకు చేరింది. కూనవరంలో 36.34కు చేరింది. సోకులేరు వాగు పొంగటంతో చింతూరు-విఆర్‌పురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కూనవరం : మండలవ్యాప్తంగా ఉన్న మిర్చి పైర్లు గోదావరి మింగే సింది. ఇప్పటికే వర్షాలతో ఆలస్యం అయిన మిరప పంట గత వారంలో అదును ఇవ్వడంతో రైతులు నాటుకున్నారు. శుక్రవారం గోదావరి ప్రవాహంతో మిర్చి పైర్లన్నీ నీటమునిగాయి. విలీన మండలాల్లో ఎక్కువగా సాగుచేసేది మిర్చి పంట. గత రెండేళ్లుగా మిర్చికి గిట్టుబాటుధర రాకపోవడంతో సాగు తగ్గుతోంది. మళ్ళీ ఈ ఏడాది సాగుచేసినా గోదావరి పోటెత్తడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మళ్ళీ మిర్చి నారు కొనాలంటే ధర విపరీతంగా ఉందని, కొన్నాసరే ఉపయోగం ఉండదని వాపోతున్నారు. పోలవరం ప్రాజెక్ట్ వల్ల విలీన మండలాల్లో అటు ఇళ్లు, ఇటు పంటలు కూడా మునిగిపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

విఆర్‌పురం: విలీన మండలాలను గోదావరి వరదలు వీడటం లేదు. రెండు నెలలుగా సాగుభూములు ముంపులో ఉండటంతో రైతులకు కన్నీరే మిగిలింది. కన్నాయిగూడెం, చింతరేవుపల్లి, అడవివెంకన్నగూడెం, రామవరం, తుష్టివారిగూడెం, శ్రీరామగిరి ఇప్పూరు గ్రామాల చుట్టూ వరదనీరు చేరింది. చింతరేవుపల్లి, ప్రత్తిపాక గ్రామాల్లో పది ఎకరాలు ముంపునకు గురయ్యాయి. రైతులు ఇటీవల మిరప, పువ్వాకు సాగు ముమ్మరం చేశారు. ఇప్పటికే వందల ఎకరాల్లో నాట్లు వేశారు. మళ్లీ వరద పెరుగుండటంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

విఆర్‌పురం: చింతరేగుపల్లి రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

వారపు సంతలో దసరా సందడి

- మేకలు, గొర్రెలు, నాటు కోళ్లకు గిరాకీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని శుక్రవారం జరిగిన అరకు సంతలో దసర సందడి నెలకొంది. పండగ సందర్భంగా నూతన వస్త్రాలు కొనుగోలు చేయడానికి గిరిజనులు రావడంతో దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడి కనిపించాయి. ఈ పండగ సీజన్ కు చివరి శుక్రవారం సంత రోజు కావడంతో మేకలు, నాటు కోళ్ల కొనుగోలు చేయడానికి అధికమంది రావడంతో వాటికి బాగా గిరాకీ పెరిగింది. రెండు కేజీల నాటుకోడి రూ రూ.1200 నుంచి రూ 2000 వరకు ధర పలకగా, మేకలకు రూ 10000 ల నుంచి రూ 15000 ల వరకు ధర పలికింది. ధర అధికంగా ఉన్నప్పటికీ నాటు కోళ్ళు, మేకలు వేగంగా అమ్ముడుపోయాయి. దసరా సంత కావడంతో అధిక సంఖ్యలో గిరిజనులతో పాటు మైదాన ప్రాంత వ్యాపారస్తులు కూడా అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో, అరకు వారపు సంత కిటకిటలాడింది.

సంతకు తీసుకొచ్చిన గొర్రెలు

అరకులోయలో ఎన్‌సిసి ట్రెక్కింగ్ ప్రారంభం

ర్యాలీ చేపడుతున్న ఎన్‌సిసి క్యాడెట్లు

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయలో ఆల్ ఇండియా ఎన్‌సిసి ట్రెక్కింగ్ ఎక్స్ పెడిషన్ కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా ఉన్న క్యాడెట్లు సాహసోపేతమైన, విద్యాపరమైన, సామాజికంగా ముఖ్యమైన కార్యకలాపాలలో పాల్గొనడంతో ఆల్ ఇండియా ఎన్ సి సి ట్రెక్కింగ్ ఎక్స్‌పెడిషన్ ఉల్లాసభరితంగా కొనసాగింది. దీనిలో భాగంగా మండలంలోని సుంకరమెట్ట గ్రామం నుండి ప్రారంభమైన గోలికొండ శిఖర సమ్మిట్ ట్రెక్‌తో ట్రెక్కింగ్ యాత్ర ప్రారంభమైంది. ట్రెక్కింగ్‌లో క్యాడెట్లు తమ ఓర్పు, క్రమశిక్షణను ప్రదర్శించారు. బొర్రా గుహలు, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్‌లను సందర్శించారు.మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ, "క్లీన్ అరకు లోయ - ప్లాస్టిక్ రహిత" ర్యాలీని నిర్వహించారు. క్యాడెట్ల మధ్య క్విజ్ పోటీతో మొదటిరోజు కార్యక్రమం ముగిసింది.

సుడిదోమ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-చింతపల్లి : వరి సాగులోసుడి దోమ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ సాంకేతిక నిపుణులు డాక్టర్ అప్పలరాజు సూచించారు. చింతపల్లి మండలం కొత్తపాలెం గ్రామంలో రైతుల వరి పొలాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగులో అనేక చీడ పీడల సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారని, అందులో సుడిదోమ ముఖ్యమైనదని చెప్పారు. ఈ సుడిదోమ అనేది వరి పొలంలో దుబ్బు మొదట్లో గుంపులు గుంపులుగా చేరి వరి మొక్క నుండి రసం పీల్చి పంటకు నష్టం చేస్తుందని, తెలిపారు. దానివల్ల మొక్క బలహీనపడి పోషకాలన కోల్పోతుందన్నారు. ఈ సుడిదోమ కొన్ని రకాలైన వైరస్‌లను కూడా వ్యాప్తి చేస్తుందన, చేను పసుపు రంగులోకి మారటం, వరి పంట సుడు సుడులగా ఎండిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సుడిదోమ యాజమాన్యం కొరకు రైతులు వరి పంటలను లైన్ పద్ధతిలో నాటుకోవాలని, రసాయన ఎరువులు విచక్షణారహితంగా వాడకూడదని, పొలంలో నీరు ఎక్కువగా నిలబడకుండా, కేవలం బురద పదును మాత్రమే ఉండేలా చూసుకోవాలని సూచించారు. వేపాకుల కషాయం, వేప నూనె సమయానుకూలంగా పిచికారీ చేయడం వలన దోమ వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. ఉధృతి మరీ ఎక్కువగా ఉన్నప్పుడు ఫ్లోనికామైడ్ 70డబ్ల్యుజి 60 గ్రాములు ఎకరాకు, పైమెట్రోజన్ 50డబ్ల్యుజి 120 గ్రాములు ఎకరాకు, డైనోటీఫురాన్ 15 శాతం పైమెట్రోజన్ 45శాతం డబ్ల్యుజి 133 గ్రాములు ఎకరాకు వంటి క్రిమిసంహారక మందులు సూచించిన మోతాదులో వ్యవసాయ నిపుణుల సలహా మేరకు వాడుకోవాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సాంకేతిక నిపుణులు

మండిపల్లి వాగు దాటుతున్న గిరిజనులు

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

ప్రజాశక్తి-చింతపల్లి : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఏజెన్సీలో వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చింతపల్లి మండలంలోని బలపం పంచాయతీ పరిధిలో మండిపల్లి, గుంజివీధి గ్రామాల మధ్యలో ఉన్న వాగు ఉధృత ప్రవాహంతో ముంచెత్తుతోంది. ఈ పరిస్థితుల్లో మండిపల్లి గ్రామ గిరిజనులు ప్రాణాలకు తెగించి వాగు దాటే పరిస్థితి ఏర్పడింది. గత 15 ఏళ్లుగా ఈ వాగుపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల సమయంలో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ప్రాణాలను ఫణంగా పెట్టి వాగు దాటాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి రామకృష్ణ, గ్రామస్తులు జి.రమ, జి.రామారావు, ఎస్.పొట్టి పడాల్, సంతోష్, లోవరాజు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వంలోనూ వాగుపై వంతెన నిర్మిస్తామని హామీలు ఇస్తారుగాని, ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు.

అంగన్‌వాడీలకు ఐదు రోజులు సెలవు ఇవ్వాలి

ప్రజాశక్తి-విఆర్‌పురం : అంగన్‌వాడి కేంద్రాలకు ఐదు రోజులు సెలవు ఇవ్వాలని చిన్నమట్టపల్లి పంచాయతీ ఎంపిటిసి పూణెం ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలకు దసరా సందర్భంగా సెలవు ప్రకటించాలని దీంతో వారు పనిఒత్తిడి నుంచి బయట పడతారన్నారు. ప్రభుత్వం తక్షణమే సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఆరుబయట నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: దూసరపాములో చైన్‌చోరీ కేసు నమోదైన నేపథ్యంలో ఆరుబయట నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలని రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ హెచ్చరించారు. దూసరపాములో బుధవారం అర్ధరాత్రి మేడిశెట్టి అచ్చియమ్మ పుస్తెలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా అర్ధరాత్రి సమయంలో గ్రామాల్లో సంచరిస్తే వెంటనే 9440900765 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ధారాలమ్మను దర్శించుకున్న భక్తులు

ప్రజాశక్తి-సీలేరు: జికెవీధి మండలం ఘాట్‌రోడ్‌లో వెలసిన ధారాలమ్మ అమ్మవారిని దర్శించుకోడానికి భవానీ భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. శుక్రవారం కావడం మైదాన ప్రాంతం నుంచి కూడా భక్తులు అధికంగా తరలి వచ్చారు.

పశుదాణా పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగమణి తదితరులు

సమిష్టి నిర్ణయాల వల్లే సంతృప్తికర పాలన

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని పెద్దఆర్కూర్ పంచాయతీ పరిధిలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి అధ్యక్షతన పంచాయతీ పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ 2021లో పాలకవర్గంగా తమను ఎన్నుకున్నారని ఈ నాలుగున్నర సంవత్సరాలు పలు గ్రామాల్లో ప్రజల సమన్వయంతో స్థానిక సమస్యలు కొంతమేర పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఇంకొన్ని కొత్తపనులు గుర్తించామని రాబోయే కొన్నినెలల వ్యవధిలోనే ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. పెద్దఆర్కూర్‌లో పశువుల దాణా పంపిణీ చేశారు. సర్పంచ్, ఎంపిటిసి అమ్మాజీ దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంవివి ప్రసాద్

వాటర్‌ట్యాంకు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలోని మంప పంచాయతీలో 20 లక్షల 80 వేలతో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామల్లో అభివృద్ధి పదంలో ముందంజలో ఉందని ప్రభుత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి రమేష్ సర్పంచ్ పడాల్ మాజీ ఎంపిటిసి శివరాం, సర్పంచ్, బిజెపి,జనసేన నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఎఇ ఉమామహేశ్వరరావు

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి -కొయ్యూరు: పిఎం జన్‌మన్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఇళ్లుత్వరితగతిన పూర్తి చేయాలని కొయ్యూరు మండల హౌసింగ్ ఎఇ పొత్తూరు ఉమామహేశ్వరరావు లబ్దిదారులకు సూచించారు. డౌనూరు గ్రామ సచివాలయ పరిధిలోని బచ్చింత, ఉసిరికపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. డిసెంబరు నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

▸ పిజిఆర్ఎస్ వినతులపై జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి సమస్య పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డిఆర్ఒ కె.పద్మలతలతో కలిసి సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 121 వినతులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి ప్రతి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం అధికారుల ద్వారా జరుగుతుందని ప్రజలు మన దగ్గరకు వస్తారని, ఆ నమ్మకాన్ని ప్రతి అధికారి నిలబెట్టుకోవాలన్నారు. ప్రతి వినతిని క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం కావాలన్నారు. పరిష్కారమైన వినతులపై అర్జీదారులు తమ సంతోషాన్ని వ్యక్తపరిచే దిశగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా పూర్తి కాని దరఖాస్తులపై ఆరా తీసి వచ్చిన దరఖాస్తుల పరిశీలనా కార్యక్రమం సోమవారం చేపట్టి త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని..

పెదబయలు మండలం ఇంజెరి పంచాయతీ సర్పంచ్ గెమ్మెలి రమణమ్మ తమ పంచాయతీ పరిధిలో రోడ్డు సౌకర్యం లేని 8 గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీకి చెందిన గెమ్మెలి చిన్ని తనకు సంబంధించిన జగన్ ఇల్లు ప్రాజెక్ట్ స్థలంలో ఉన్నందున బిల్లు పెట్టేందుకు సాంకేతిక సమస్యలను సరిచేసి ఇళ్లు కట్టుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పెదబయలు మండలం వంజరి ఎ.మత్స్యరాజు తన భూమిలో ఉన్న సుమారు 1200 నీలగిరి చెట్లు అమ్ముకొనుటకు రెవెన్యూ అటవీ శాఖల అనుమతులు కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నందా, డిఆర్ డిఎ పిడి వి.మురళీ, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎంవిఎస్. లోకేశ్వరరావు, ఐసిడిఎస్ పిఒ ఝాన్సీరామ్ పడాల్, ఆర్అండ్ బి ఇఇ బాలసుందర బాబు, టిడబ్ల్యు డిడి పిబికె పరిమళ, డిపిఒ పిఎస్ కుమార్, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం.హేమలత పలువురు తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

జాబ్ మేళాకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ భారతి అధ్యక్షతన మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో 40 మంది ఎంపికయ్యారు. వారికి మూడు నెలలపాటు ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యం విశాఖపట్నం షీలానగర్‌లోని డిడియు-జీకేవై కాంపస్‌లో కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మిలీనియం సాఫ్ట్వేర్ సంస్థ తరపున ట్రైనర్లు సిహెచ్. శివమణి, వై.అరవిందు, నేహా డాలీ, గాయత్రి గార్లు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి ఎంపిక చేశారు. అక్టోబర్ 8న చింతపల్లిలో మరో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: రహదారులు, భవన నిర్మాణాలు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్ నుండి గిరిజన సంక్షేమ శాఖ, రహదారులు భవనాలు, పి.ఆర్ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో సమీక్షలో చేపట్టిన పనుల పురోగతి నేటి వరకు జరిగిన ప్రోగ్రెస్ వర్క్స్ (ప్రోపోజల్స్) పై ఆరా తీశారు. నాబార్డ్ రోడ్డు పనులు నవంబర్ లో ప్రారంభించనున్నట్లు ఆర్అండ్బి ఇఇ తెలిపారు. హాట్ రోడ్ లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి అతిథి గృహానికి సంబంధించి డిజైన్ తయారు చేసి నివేదికలు అందజేయాలన్నారు. ముందుగా ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు. రంపచోడవరం ఇఇ మాట్లాడుతూ టార్గెట్లు అచీవ్ మెంట్ కలెక్టర్ కు వివరించారు. ట్రైబల్ వెల్ఫేర్ పి.ఎం జన్మన్ 6 భవనాలకు 5పూర్తి అయ్యాయని ఒకటి త్వరలో పూర్తి కానున్నట్లు అని వివరించారు. మల్టీపర్పస్ భవన నిర్మాణాల పురోగతి వివరించారు. హెల్త్ సెంటర్స్ నిర్మాణాలపై సంబంధిత అధికారులు వివరించారు. ఇఎంఆర్ఎస్ మంజూరైన పనుల పురోగతి పై సమీక్షించి పనులు వేగవంతం చేయాలని, ప్రారంభం కాని పనులు ప్రారంభించే దిశ చర్యలు చేపట్టాలన్నారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్వాడీ భవనాలు, పి ఎం జన్మన్ పథకంలో మంజూరు చేసిన పనులు, సిసిడిపి లో చేపట్టిన పనుల పురోగతి రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై కలెక్టర్ సమీక్షించారు. సిసి రోడ్ల పురోగతిపై ఆరాతీశారు. గ్రౌండింగ్ చేయవలసిన పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గోకులం షెడ్లు నిర్మాణాలు పూర్తి చేసి డైరీని అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు, సబ్ కలెక్టర్లు వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

జిఎస్టీ పై అవగాహన కల్పించాలి

పాడేరు: జిఎస్టి మినహాయింపుపై అందరికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అన్నారు. జిఎస్టి రేట్ కట్ పై అవగాహన కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం గిరిజన జిల్లా సమాఖ్య కార్యాలయం నుండి ర్యాలీ జిల్లా కలెక్టర్, ఐ.టి.డి.ఏ ప్రాజెక్ట్ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకి ఈ జిఎస్టి 20 వచ్చిన రేట్ కట్ గురించిన విషయాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిఎస్టి లో పెట్టిన ధరలు ఈనెల 22 నుంచి కొత్త స్లాబ్ కి వచ్చిన రేటే అమ్మాలని విషయాలు కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ ర్యాలీలో ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, సహాయ కలెక్టర్ సాహిత్, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ అధికారి వి మురళీ, జిఎస్టి నోడల్ అధికారి వర్ధన్ వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

▸ చింతపల్లి మండల పరిషత్ సమావేశం

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అనూషాదేవి

ప్రజాశక్తి-చింతపల్లి : మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి కృషి చేయాలని ప్రజాప్రతినిధులు చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పని చేస్తేనే పల్లెలు అభివృద్ధి దిశగా పయనిస్తాయని చెప్పారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ తాజంగి, కొండవంచుల గ్రామాల్లో బస్సు షెల్టర్లు నిర్మించాలని, రోజుకు ఒకసారైనా బస్సు సర్వీసు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. లోతుగడ్డ వంతెన నుంచి కోరుకొండ వరకు శిథిలమైన రహదారిని తక్షణమే పునర్నిర్మించాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్ళే రోడ్ల నిర్మాణంలో అటవీశాఖ అడ్డంకులు సృష్టిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. లోతుగడ్డలోని అటవీశాఖ ఆఫీసును అన్నవరం కేంద్రానికి తరలించడాన్ని సర్పంచ్ సునీల్ వ్యతిరేకించారు. పూర్వీకులు సంపాదించిన భూములను వారసులకు పంచిపెట్టే విషయంలో రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. జడ్పిటిసి పోతురాజు బాలయ్య మాట్లాడుతూ చింతపల్లి పట్టణంలో గిరిజనేతరులు బహుళ అంతస్తులు కడుతున్నారని, కానీ గిరిజనులు చిన్న ఇల్లు నిర్మించుకోవాలన్నా వంద కారణాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిలో ఊర్మిల, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, తహశీల్దార్ ఆనందరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాన కోర్టు భవనంలో కరపత్రాలను పంపిణీ చేస్తూ సంతకాలను సేకరించారు. ఐలు, రాష్ట్ర న్యాయవాదుల సంఘం పిలుపుమేరకు సంతకాలను సేకరించి సోమవారం కలెక్టర్‌కు సమర్పిస్తామని ఐలు ప్రధాన కార్యదర్శి నూకల వెంకటేశ్వరరావు తెలిపారు. న్యాయవాదుల ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, న్యాయవాదులకు మరణాంతర రూ.10 లక్షల పరిహారం, ఆరోగ్యబీమా కార్డులు, బార్ అసోసియేషన్ ఆధునీకరణ, డిజిటల్ గ్రంథాలయాల అభివృద్ధి, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.పదివేల భృతి, ల్యాప్‌టాప్‌లకు వడ్డీలేని రుణాలు, అర్హులకు ఇళ్లస్థలాలు, ప్రభుత్వం ప్రకటించిన 100 కోట్ల గ్రాంట్‌ను వెంటనే ఏపి బార్ కౌన్సిల్ జమ చేయడం వంటి హామీలను నెరవేర్చాలని కోరారు

బురద గెడ్డలో ట్రాఫిక్ జామ్

▸ గంటల తరబడి నిలిచిన వాహనాలు

▸ వారపుసంతకు వచ్చే ప్రజలు, పర్యాటకుల అవస్థలు

నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతకు సమీపంలో గల బురద గెడ్డలో వాహనాల రద్దీతో శుక్రవారం గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో వాహన దారులు, ప్రయాణికులు, పర్యాటకులు పలు ఇబ్బందులు పడ్డారు. బురద గెడ్డ బ్రిడ్జికు అనుకుని ఉన్న రోడ్డు కోతకు గురై పెద్ద గొయ్యి ఏర్పడింది. గొయ్యి ఏర్పడి సుమారు ఏడాది గడిచినా దానిని పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో, ఆ గొయ్యి వర్షాకాలంలో మరింత కోతకు గురై ప్రమాదకరంగా తయారయింది. దసరా పండగ చివరి వారపు సంత రోజు కావడంతో అరుకు వారపు సంతలో అధిక సంఖ్యలో గిరిజనులు నూతన వస్త్రాలను, సామాగ్రిలను కొనుగోలు చేయడానికి వాహనాలతో వచ్చారు. అరకు వారపు సంత, ఎండపల్లి వలస ఇరువైపుల నుంచి ఒకేసారి వాహనాలు అధికంగా రావడంతో మధ్యాహ్నం వాహనాల రద్దీతో సుమారు గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ఉదయం నుంచి సుమారు 12 గంటల వరకు పోలీసులు చర్యలు తీసుకున్నప్పటికీ మధ్యాహ్నం వారు వెళ్లిపోవడంతో ఆ తర్వాత వాహనాల ట్రాఫిక్ ఏర్పడింది. అరుకు అందాలను తిలకించడానికి వచ్చిన పర్యాటకులు కూడా ఈ ట్రాఫిక్‌తో ఇబ్బందులకు గురయ్యారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి బురద గెడ్డలో ఏర్పడిన గొయ్యిని పూడ్చాలని వాహనదారులు, ప్రయాణికులు, పర్యాటకులు కోరారు.

క్విజ్ ఫైనల్స్‌కు గీతం, కృష్ణా కాలేజీలు

ఫైనల్స్ చేరిన విద్యార్థులతో నిర్వాహకులు

ప్రజాశక్తి-మధురవాడ : ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై యువతలో అవగాహనకు అపోలో టైర్స్ సంస్థ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్విజ్ పోటీలలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి గీతం వర్సిటీ, డాక్టర్ వివిఎస్.కృష్ణా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచి, ఫైనల్స్‌కు అర్హత సాధించారు. గీతం వేదికగా శుక్రవారం నిర్వహించిన పోటీల్లో ఎనిమిది కళాశాల జట్లు పాల్గొనగా గీతం పర్యావరణ శాస్త్ర విభాగం విద్యార్థులు బంగారు రితిక, శ్రీవిష్ణు సారథి ప్రథమ స్థానంలో నిలిచారు. కృష్ణా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఎమ్.అచ్చంనాయుడు, పి.సాయికుమార్ ద్వితీయస్థానంలో నిలిచారు. ఈ ఏడాది డిసెంబర్‌లో కేరళలో నిర్వహించే ఫైనల్ పోటీలలో ఇతర రాష్ట్రాల జట్లతో టైటిల్ కోసం వీరు పోటీ పడతారని అపోలో టైర్స్ సిఎస్ఆర్ విభాగం ప్రతినిధి లీఫెన్ తెలిపారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నీరజ్‌మిశ్ర, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సూరేష్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు.

సిఆర్‌పిలకు శిక్షణ

ప్రజాశక్తి- రంపచోడవరం : మండలంలోని ఐ పోలవరం పంచాయతీ శుక్రవారం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో రంపచోడవరం డివిజన్‌కి సంబంధించి రంపచోడవరం, గంగవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల సిఆర్‌పిలకు ఘనవ్యర్థాల నిర్వహణ-గృహస్థాయి వ్యర్థాల వర్గీకరణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రంపచోడవరం మండల డిప్యూటీ ఎంపిడిఒ వై.రాజు రంపచోడవరం డివిజనల్ పంచాయతి కార్యాలయం జూనియర్ అసిస్టెంట్లు చవలం తమ్మన్నదొర హాజరయ్యారు. డిప్యూటీ ఎంపిడిఒ వై.రాజు మాట్లాడుతూ 1000 కుటుంబాలకు ఒక సిఆర్‌పి పనిచేయాలన్నారు. నాలుగు మండలాల సిఆర్‌పిలు, ఐ.పోలవరం పంచాయతీ కార్యదర్శి వినోలి, ఎఫ్‌టిసి సుబ్బారావు, రంపచోడవరం డివిజనల్ పంచాయతి కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైద్యశిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి- రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల సిరిగిందలపాడు, (రంపచోడవరం)కాకినాడ రంగారాయ వైద్యకళాశాలలోని బహుళ విభాగాల పరిశోధన కేంద్రం, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా స్థానిక సిరిగిందలపాడులో ఆదివారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామిపరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్యశిబిరంలో స్త్రీలలో వచ్చే క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని తెలిపారు.

అన్నదానం చేస్తున్న కమిటి సభ్యులు

ఘనంగా అన్నదానం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో షిర్డిసాయి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం రామాలయం సెంటర్‌లో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. షిర్డిసాయి వేడుకల్లో భాగంగా ఈనెల 24 నుంచి భజన కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 28న షిర్డిసాయి జన్మదిన వేడుకలు నిర్వహించడానికి షిర్డిసాయి కమిటీ సభ్యులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ, ఎస్ఐ

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-చింతూరు: చింతూరు జూనియర్ కళాశాల విద్యార్థులకు శక్తి యాప్ ఉపయోగాలు గూర్చి సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్ అవగాహన కల్పించారు. శుక్రవారం ఎర్రంపేట కళాశాలలోని విద్యార్థులకు సోషల్‌మీడియా మోసాలు గూర్చి, చట్ట వ్యతిరేకమైన చర్యలు గూర్చి వివరంగా తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణలో కూటమి నాయకులు వైఫల్యం

నిరసన తెలుపుతున్న ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టిడిపి, జనసేన కూటమి నాయకులు ఇప్పుడు ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఇది వారి వైఫల్యానికి నిదర్శనమని, దుర్మార్గమని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎన్.మాధవి, వై.సత్యవతి ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాలు జెఎసి చేపట్టిన దీక్షలు శుక్రవారం 1642వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరంలో ఐద్వా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కుపరిశ్రమ రక్షణ కోసం కార్మికులు, యువకులతో పాటు మహిళలు భాగస్వాములవుతున్నారన్నారు. 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. విఆర్ఎస్ పేరుతో పర్మినెంట్ కార్మికులను ఇళ్లకు పంపుతోందన్నారు. స్టీల్ ప్లాంట్‌కి గనులు కేటాయించకుండా, ఇంకా ప్రారంభం కాని మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కి గనులు కేటాయించి కార్పొరేట్లకి దాసోహం అంటోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఆఫీస్ బేరర్స్ ఆర్.వరలక్ష్మి, డి.కొండమ్మ, సిహెచ్.సుమిత్ర, ఎస్.విజయలక్ష్మి, జి.లక్ష్మీ, కె.అనురాధ, కె.కుమారి, సుజాత, శారద,భవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయండి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో అన్ని స్కానింగ్ కేంద్రాలను సందర్శించి స్కానింగ్ చేసే డాక్టర్లు, వారి విద్యార్హతలు, సెంటర్ యొక్క డాక్యుమెంట్లను పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం జిల్లా స్థాయి మల్టీ మెంబెర్ అప్రోప్రియేట్ అథారిటీ, జిల్లాస్థాయి ఎడ్వైజరీ కమిటీ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కానింగ్ కేంద్రం వారు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తును పూర్తిగా పరిశీలించి పర్మిషన్ ఇవ్వాలని సూచించారు. 5 శాతం ఉచితస్కాన్స్ అన్ని ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల (క్లినిక్స్, ల్యాబ్స్, హాస్పిటల్స్)లో విధిగా చేయాలని, ఆ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో విధిగా సమర్పించాలని ఆదేశించారు.

రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేయించుకో వాల్సిన వారు నెల మొత్తంలో గర్భిణులకు సంబంధించి చేసిన స్కాన్స్‌లో 5 శాతం ఉచితస్కాన్స్ వివరాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమర్పించి రెన్యువల్ రిజిస్ట్రేషన్ పొందాలని ఆదేశించారు. డెకాయ్ ఆపరేషన్స్ సంబంధిత అధికారులతో పకడ్బందీగా నిర్వహించా లని ఆదేశించారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఈ విషయంలో అన్ని శాఖల వారు సహకరించాలని సమావేశాల్లో పాల్గొని అవగాహన కలగచేయాలని పురుషునితో సమానంగా స్త్రీ యొక్క నిష్పత్తిని పెంచాలని కోరారు. లైన్ డిపార్ట్మెంట్స్ వారి సహకారంతో ఇంకా ఎక్కువగా డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని, స్కానింగ్ కేంద్రాలు తనిఖీ చేసేటప్పుడు నిభంధనలు పాటించాలని, ఐఇసి, ద్వారా ప్రజలకు అవగాహన కలగచేయాలని తెలిపారు. సమావేశంలో డాక్టర్ సౌమిని(గైనకాలజిస్ట్) డాక్టర్ రత్నకుమారి, (పిడియాట్రిక్స్) డాక్టర్ శ్రీకాంత్(రేడియోలజిస్ట్, కేజిహెచ్) డాక్టర్ ఆర్.రమేష్ (డిఎఎల్టిఒ) డాక్టర్ లూసీ (డిఐఒ),డాక్టర్ బి.ఉమావతి (డిపిఎంఒ) డెమో బి.నాగేశ్వరరావు, పి.రమేష్‌బాబు, ఎన్‌జిఒ జి.మల్లేశ్వరి, ఎస్.సాయిరోహిత్ (జిల్లాకోర్టు), కె.పద్మావతి, (ఎన్‌జిఒ) డెమో విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రో ప్రాజెక్టు జిఒలను రద్దు చేయాలి

అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం ఆధ్వర్యంలో ధర్నా

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి అనంతగిరి: అదానీ నవయుగ కంపెనీకి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు కట్టబెడుతూ జారీ చేసిన జిఒలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి ప్రైవేట్ సంస్థలకు గిరిజన సాగుభూములను అప్పగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హైమావతి, మాజీ జెడ్పిటిసి గంగన్నదొర, వైసిపి ఎంపిటిసిలు, సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

వాతంగి రహదారి నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి పంచాయితీ కొమరాపురం నుండి లోదొడ్డి పంచాయితీ పాకవెళ్లి వరకూ రహదారిని మరమ్మతులు చేయించాలని మాతంగి పంచాయతీ సర్పంచ్ భీమిరెడ్డి సుబ్బలక్ష్మి, ఉపసర్పంచ్ రాళ్లగడ్డ అర్జున్, వైస్ ఎంపిపి జుర్ర రాజేశ్వరి జానుబాబు, వార్డు సభ్యులు శుక్రవారం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. గ్రామస్తులు భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జుర్రా లక్ష్మయ్య, శెట్టిపల్లి చంద్రమౌళి మద్ది కొండ నూకరాజు (టీచర్) పాల్గొన్నారు.

నేడు పర్యాటక ప్రాంతాల్లో ఉచిత ప్రవేశం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27 సందర్భంగా విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్న పలు ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు చైర్‌పర్సన్ ఎంవి ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. విఎంఆర్‌డిఎ నిర్వహణలో విఎంఆర్డిఎ పార్క్, కైలాసగిరి, సెంట్రల్ పార్క్, తెలుగు మ్యూజియం, సబ్‌మెరైన్ మ్యూజియం, టియూ142 ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం, సీ-హారియర్ మ్యూజియం, యుహెచ్-3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియంలో ఉచిత ప్రవేశం లభిస్తుంది. విశాఖపట్నం నగరవాసులు, పర్యాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆటో డ్రైవర్ దారుణహత్య

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిక్కవానిపాలెంలో ఆటోడ్రైవర్ హత్యకు గురైన సంఘటన సంచలనం కలిగించింది. కంచరపాలెం పోలీసులు అందజేసిన సమాచారం ప్రకారం గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కంచరపాలెం పరిధిలోని తిక్కవానిపాలెంలో నివాసముంటున్న నాగలి గణేష్ కుమార్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి తిక్కవానిపాలెం సమీపంలో శివాలయం ఎదురుగా ఉన్న రైల్వేఖాళీ స్థలంలో రౌడీషీటర్ తరుణ్, మరో ముగ్గురితో కలిసి మద్యం తాగాడు. అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో మద్యం మత్తులో వీరి మధ్య వివాదం జరిగింది. దీంతో వారు పెద్దగా కేకలు వేసుకుంటూ గొడవ పడుతుండడంతో సమీపంలో ఉన్న గణేష్‌కుమార్ అక్కడికి చేరుకున్నాడు. ఘర్షణలో అక్కడ ఉన్న రాడ్ బెండింగ్ కర్రతో తరుణ్, గణేష్ తలవెనుక కొట్టడంతో తీవ్రంగా రక్తస్రావమై అక్కడికక్కడే గణేష్‌కుమార్ మృతి చెందాడు. నైట్ రౌండ్స్‌లో ఉన్న పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కెజిహెచ్‌కి తరలించారు. ముద్దాయిలపై కేసు నమోదు చేశామని వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

4న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం అక్టోబర్ 4న చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి సమావేశం కొనసాగుతుందన్నారు.

సన్యాసిపాత్రునికి కెకె.రాజు పరామర్శ

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: వైసిపి రాష్ట్ర కార్యదర్శి, విశాఖ ఉత్తర, తూర్పు నియోజకవర్గాల పరిశీలకులు చింతకాయల సన్యాసిపాత్రుడు అనారోగ్య కారణంతో మెడికోవర్ హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్నారు. శుక్రవారం ఆయనను వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, జోనల్ అధ్యక్షులు అంబటి శైలేష్, ముత్తి సునీల్‌కుమార్ తదితరులు పరామర్శించారు.